క్లుప్తంగా

ఘనంగా సుదర్శన జయంతి



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై మంగళవారం అంగరంగ వైభవంగా శ్రీ సుదర్శన జయంతి మహోత్సవాన్ని నిర్వహించారు. జీయర్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి పరిపూర్ణ మంగళ శాసనాలతో, అహోబిల రామానుజస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం 9 గంటలకు శ్రీ సుదర్శన నరసింహ పెరుమాళ్లకు అభిషేకం, అలంకరణ, సుదర్శన మహా యాగం సీతారాముల నిత్య కల్యాణ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా కనుల పండువగా నిర్వహించామని తెలిపారు. శత్రుబాధ నివారణ కోసం సుదర్శన మహాయాగం నిర్వహించినట్లు వివరించారు. అనంతరం భక్తుల కు తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించినట్లు తెలిపారు.

ప్రసన్నాంజనేయస్వామికి నాగవల్లీ దళార్చన



ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలోని సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో అధిక శ్రావణమాస మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు ప్రసన్న, వినయ్‌కుమార్‌లు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామార్చనలు చేశారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

పత్తిలోడు మినీలారీ బోల్తా

ఒకరికి తీవ్ర గాయాలు



ఫిరంగిపురం: పత్తి లోడుతో వెళుతున్న మినీలారీ ప్రమాదవశాత్తూ ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి రోడ్డు మార్జిన్‌లో బోల్తాపడింది. ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని రేపూడి గ్రామశివారులో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాగార్జునసాగర్ నుంచి పత్తి లోడుతో గుంటూరు వెళుతున్న మినీలారీ ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామ శివారు వద్ద ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి రోడ్డు మార్జిన్ వైపు తిప్పడంతో బోల్తాపడింది. వాహనంలో ప్రయాణిస్తున్న అనిల్ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. అతనిని ప్రైవేటు వాహనంలో చికిత్స కోసం తరలించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

నియోజకవర్గ ఎన్నికల అధికారి లలిత



మంగళగిరి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి లలిత అన్నారు. నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఓటర్ల జాబితాలో మార్పులు–చేర్పులు ప్రక్రియపై వీఆర్‌ఓ, వీఆర్‌ఏలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఉదయం నుంచి సాయంత్రం వరకు బీఎల్‌ఓలను ఓటర్లకు అందుబాటులో ఉంచడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ఓటర్లు వినియోగించుకుని తమ ఓటును ఓటర్ల జాబితాలో సరి చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ హేమమాలిని, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి లతో పలువురు వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

పెయింటింగ్ కళాకారులకు తోడ్పాటు

నెహ్రూనగర్: పెయింటింగ్ కళాకారులకు నగర పాలక సంస్థ తరఫున తగిన తోడ్పాటునందించడానికి చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు తెలిపారు. మంగళవారం ది పెయింటింగ్ (ఆర్ట్స్) వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మేయర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి నగర పాలక సంస్థ చేపట్టే పెయింటింగ్ పనులను తమకు కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. మేయర్ మాట్లాడుతూ నగర అభివృద్ధి పనులలో భాగంగా చేపడుతున్న పెయింటింగ్ పనులను దిపెయింటింగ్(ఆర్ట్స్) వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జీవనోపాధికై తమకు కేటాయించాలని కోరారని, సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని అధికారులను ఆదేశించామన్నారు. అసోసియేషన్ గౌరవ సలహాదారులు ఆర్.వినోద్ చౌదరి, చెన్నం కళ్యాణ శ్రీనివాసరావు, అధ్యక్షుడు వీళ్ల దుర్గాప్రసాద్, ప్రధానకార్యదర్శి వి.రాజేష్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో బహుళ ప్రయోజనాలు

అడిషనల్ కమిషనర్ హేమమాలిని



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న అడిషనల్ కమిషనర్ హేమమాలిని

మంగళగిరి: ప్రజా సమస్యలను పరిష్కరించే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని, జగనన్న సురక్షతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ హేమమాలిని అన్నారు. మంగళవారం 14,15 వార్డు సచివాలయాల పరిధి ఎన్‌సీసీ రోడ్డు, టిప్పర్ల బజారులో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం జరిగిన ఆయా కార్యక్రమాల్లో అడిషనల్ కమిషనర్ హేమమాలిని మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అర్హత ఉండి పొరపాటున ఎక్కడైనా మిగిలిపోయిన అర్హులను కూడా తలుపుతట్టి మరీ మంచి చేసే కార్యక్రమమే జగనన్న సురక్ష కార్యక్రమం అన్నారు. పేద లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలు, ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, గృహసారథులందరూ నేరుగా లబ్ధిదారుల వద్దకు వెళ్లి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఇప్పించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమన్నారు. అర్హులై ఉండి ఏ ఒక్కరూ కూడా ప్రభుత్వ పథకాల లబ్ధిని కోల్పోకూడదని, అలాంటి వారిని గుర్తించి వారికి కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు ఇప్పించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఎలాంటి సేవా రుసుం లేకుండా 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు అడిషనల్ కమిషనర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, పట్టణ ఎస్ఐ మహేంద్ర, రెవెన్యూ అధికారి బాబూరావులతోపాటు పలువురు నగరపాలక, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. నూతక్కిలో జరిగిన కార్యక్రమంలో ఆర్‌ఐ యశోదరావు, పంచాయతీ సెక్రటరీ సత్యనారాయణ పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

- మృతుడి స్వస్థలం పశ్చిమ బెంగాల్
- విలపిస్తున్న తల్లిదండ్రులు



బిల్డింగ్‌పై నుంచి దూకడంతో మృతి చెందిన బీటెక్ విద్యార్థి సౌరదీప్ చౌదరి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి మండల పరిధిలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన విద్యార్థి హాస్టల్ బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మదీన్ జిల్లా కొత్తపల్లికి చెందిన హోమియో డాక్టర్ సుధీర్‌చౌదరి తన కుమారుడు సౌరదీప్ చౌదరిని(19) గత సోమవారం ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరంలో చేర్పించారు. అప్పటి నుంచి హాస్టల్‌లో ఉంటున్నాడు. సుదీర్ చౌదరి, అతని భార్య గత శుక్రవారం ఇక్కడి నుంచి స్వగ్రామం వెళ్లారు. అప్పటి నుంచి సౌరదీప్ చౌదరి మిమ్మల్ని విడిచి దూరంగా ఉండలేనని, ఇంటికి వచ్చేస్తానని అంటూ తల్లిదండ్రులకు ఫోన్ చేయడంతోపాటు మెసేజ్‌లు పెట్టినా స్పందించలేదు. చివరకు ఆదివారం ఆత్మహత్య చేసుకుంటానని అంటూ మెసేజ్ పెట్టినా తల్లిదండ్రుల నుంచి సమాధానం లేకపోవడంతో కళాశాల హాస్టల్ 11వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై కళాశాల యాజమాన్యం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సౌరదీప్ చౌదరి మృతి చెందడంతో తండ్రి సుధీర్ చౌదరి నా కొడుకును నేను చంపుకున్నానంటూ బోరున విలపించాడు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని పశ్చిమ బెంగాల్‌లోని స్వగ్రామానికి తరలించారు.

ఎరువులకు ఇబ్బంది లేకుండా చర్యలు

జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు



ఎరువులను పరిశీలిస్తున్న జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు

తాడికొండ: సీజన్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు అన్నారు. తాడికొండ కోఆపరేటివ్ సొసైటీని మంగళవారం జీడీసీసీ బ్యాంకు చైర్మన్ పరిశీలించారు. బ్యాంకు భవనాలను పరిశీలించిన అనంతరం ఎరువుల గోదాములో నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. అమరావతి మండలం మునగోడు, తాడికొండ, నూతక్కి సహకార సొసైటీలలో రైతులకు అందిస్తున్న సేవలు బాగున్నాయని ప్రశంసించారు. గతేడాది సుమారు రూ.70 లక్షల విలువైన ఎరువులను రైతులకు అందించినట్లు సీఈఓ సుజనీ తెలిపారు. కోరమండల్ కంపెనీ వారి సహకారంతో నేరుగా ఎరువులు సరఫరాకు మెంబర్‌షిప్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వంగా పోలారెడ్డి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

లివర్ సమస్యలను ముందుగా గుర్తించొచ్చు

గుంటూరు మెడికల్: ఫైబ్రో స్కాన్ ద్వారా లివర్ సమస్యలను ముందస్తుగానే గుర్తించి చికిత్స చేయవచ్చని కేర్‌వెల్ హాస్పటల్‌కు చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ షేక్ నాగూర్‌బాషా చెప్పారు.

మంగళవారం స్థానిక గుంటూరువారితోట 7వలైనులోని కేర్‌వెల్ హాస్పటల్‌లో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈసందర్భంగా డాక్టర్ నాగూర్‌బాషా మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో సుమారు రూ. 10వేలు ఖరీదు చేసే ఫైబ్రో స్కాన్‌ను 90 మందికి ఉచితంగా చేశామన్నారు. పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలన్న లక్ష్యంతో ప్రతినెలా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. కొద్దిరోజుల్లోనే మరో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని, లివర్ సంబంధిత సమస్యలు తెలుసుకోవాలనుకునేవారు ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్‌బాషా కోరారు.

కార్పొరేట్ విద్యాసంస్థల మనుగడ కోసమే బంద్

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకుడు జూపూడి జాన్సన్

తాడేపల్లిరూరల్: కార్పొరేట్ విద్యాసంస్థల మనుగడ కోసమే ప్రతిపక్షాల పోరాటమని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకుడు జూపూడి జాన్సన్ అన్నారు. దుగ్గిరాలలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్న వారు విద్యార్థుల భవిష్యత్తు కోసం కాకుండా కార్పొరేట్ పాఠశాలల లబ్ధికోసమే బంద్‌కు పిలుపునిచ్చారని అన్నారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి ఖర్చు చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుమారు రూ.67 వేల కోట్ల నిధులను విద్యకోసం ఖర్చుచేశారని అన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి, పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధన, మొట్టమొదటి సారిగా బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేశారని, పాఠశాల ప్రారంభమైన మొట్టమొదటి రోజునే విద్యార్థులకు పుస్తకాలు, టెస్ట్‌బుక్స్, యూనిఫామ్ అందజేశారని అన్నారు. రాష్ట్రంలో అక్షరాస్యత శాతం పెంచాలన్న ఏకైక లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, వాటిలో భాగంగా అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, నాడు నేడు, జగనన్న విద్యాకానుక, వసతి దీవెన వంటి పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ శివగోపి

మంగళగిరి: విద్యార్థులను నిలువునా దోచుకుంటున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ యార్లగడ్డ శివగోపి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు మంగళవారం నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల బంద్ నిర్వహించారు. శివగోపి మాట్లాడుతూ కేజీ నుండి పీజీ వరకు విద్యార్థులు విద్యను అభ్యసించాలంటే నిలువునా దోపిడీకి గురవుతున్నారన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులపై నియంత్రణ లేదని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనలను ఏ మాత్రం పట్టించుకోకుండా ప్రైవేటు పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. విద్యాహక్కు చట్టప్రకారం 25 శాతం ఉచితంగా పేద పిల్లలకు విద్యను అందించాలనే నిబంధన ఉన్నప్పటికీ కార్పొరేట్ విద్యాసంస్థలు ఆ నిబంధనను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అనేక విద్యాసంస్థల్లో అర్హత లేని ఉపాధ్యాయులను నియమించి పిల్లల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిబంధనలకు విరుద్ధంగా విద్యను వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు మతే అభిషేక్, లింగిశెట్టి బాలనవ్యశ్రీ, జాలాది ఏంజెల్ గ్రేస్, సీతారామ్, భార్గవ్, రాజేష్,సుధీర్, మణి, సరస్వతీరావు తదితరులు పాల్గొన్నారు.

30న రైతు సమస్యలపై రాష్ట్ర సదస్సు



పాత గుంటూరు: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని, కార్మిక హక్కులను దెబ్బతీసే విధంగా పరిపాలన కొనసాగిస్తున్నారని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, పచ్చల శివాజీ అన్నారు. విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఈనెల 30న రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సదస్సులో ఢిల్లీ రైతు ఉద్యమాన్ని నడిపిన జాతీయ నాయకులు పాల్గొని మరో ఢిల్లీ రైతు పోరాటం రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. రైతులందరూ పాల్గొనాలని తెలిపారు. ఏఐకేఎంఎస్ నాయకులు గనిరాజు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- వలంటీర్లు సేవాభావంతో పనిచేస్తున్నారు
- ప్రముఖ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు



విద్యార్థులతో అంబటి తిరుపతి రాయుడు

మంగళగిరి: విద్యార్థులు విద్యతోపాటు క్రీడలు మరిన్ని రంగాల్లో రాణించి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని క్రికెటర్ అంబటి రాయుడు అన్నారు. కార్పొరేషన్ పరిధి ఆత్మకూరు నిర్మలా సీబీఎస్ఈ స్కూల్, ఫార్మసీ కళాశాల విద్యార్థులతో మంగళవారం మమేకమయ్యారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కృషి, పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించవచ్చన్నారు. విద్యార్థులతో కలసి క్రికెట్ ఆడి వారి పలు అంశాలు వివరించారు. అనంతరం ఆత్మకూరు పంచాయతీని సందర్శించి మాజీ సర్పంచ్ బొమ్ము శివరామిరెడ్డి రైస్ మిల్లులో తేనేటి విందును స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్లు సేవాభావంతో పని చేస్తున్నారన్నారు. చేనేత పరిశ్రమను పరిశీలించడం జరిగిందని, ప్రభుత్వం వారికి అన్ని రకాలా సహాయం అందిస్తుందని, మరింత సహాయం అందేలా భవిష్యత్తులో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. అనంతరం నూతక్కిలో పలు పంటలను పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మణిపూర్ ఘటనలకు నిరసనగా 30న భారీ ర్యాలీ



ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రాజసుందరబాబు

నెహ్రూనగర్: మణిపూర్‌లో క్రైస్తవులపై కిరాతకంగా దాడులు చేసి, క్రైస్తవ మహిళలను బహిరంగంగా నగ్నంగా ఊరేగించి, సామూహికంగా అత్యాచారం చేసిన సంఘటనలో బాధితులకు న్యాయం చేయాలని, యూసీసీని(యూనిఫైడ్ సివిల్ కోడ్) ఆపాలని కోరుతూ ఈనెల 30వ అన్ని చర్చిలు, మినిస్ట్రీలు, పాస్టర్ల అసోసియేషన్ల భాగస్వామ్యంతో వేలాది మంది క్రైస్తవులతో ఏసీ కాలేజీ నుంచి లాడ్జి సెంటర్ శాంతియుత నిరసన భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్(ఐక్య) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు తెలియజేశారు. మంగళవారం అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో క్రిస్టియన్, మైనార్టీలపై దాడులు జరుగుతున్నప్పటికి బీజేపీ ప్రభుత్వం దాని కట్టడి దిశగా అడుగులు వేయకపోవడం బాధాకరమన్నారు. మణిపూర్ రాష్ట్రంలో అల్లర్లకు ప్రధాని మోదీ, అమిత్ షా బాధ్యత వహించాలన్నారు. 30వ తేదీన నగరంలోని అన్ని ప్రముఖ చర్చిల భాగస్వామ్యంతో శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఆగస్టు 8న న్యూఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర యూసీసీ వద్దు... రాజ్యాంగమే ముద్దు అంటూ నిరసన తెలపడంతో పాటు, మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దురాగతంపై శాంతి ప్రార్థనలు నిర్వహిస్తామని తెలియజేశారు. బండ్లమూడి స్టాలిన్, కందుల దీనమణి రాజు, కట్ట దీనరాజు, టి .గాబ్రియల్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

యూపీహెచ్‌సీ వైద్యాధికారి పి అనూష



మంగళగిరి: ప్రస్తుత వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేషన్ పరిధిలోని గణపతినగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి పి అనూష అన్నారు. మంగళవారం యూపీహెచ్‌సీలో వర్షాకాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. వర్షాకాలంలో మలేరియా, టైఫాయిడ్, డెంగీ, వైరల్ జ్వరాలు, డయేరియా వంటి వ్యాధులు తరచూ వస్తాయన్నారు. అధిక టెంపరేచర్, ఒళ్లు నొప్పులు, జలుబు, గొంతునొప్పి, శరీరంపై దద్దుర్లు రావడం, విరేచనాలు, వాంతులు, నీరసం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వాతావరణంలో తేమ ఎక్కువగా ఉండటం వల్ల రకరకాల క్రిములు భూమి నుంచి బయటకు వస్తాయన్నారు. వర్షాలతో బ్యాక్టీరియా విస్తరించి ఆహారం కలుషితమై వాంతులు, విరేచనాలు వంటి సమస్యలతో జీర్ణ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతుందన్నారు.

ఆహారం కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు బయట ఆహారాలకు దూరంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో నీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. నివాస గృహాల్లో నిల్వ ఉంచిన నీటిలో పూల కుండీల్లో దోమల లార్వా పెరిగి డెంగీ, మలేరియా వచ్చే ప్రమాదం ఉందని, కావున నీటి నిల్వ ఉంచకుండా చూసుకోవడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

జీడీసీఎంఎస్ డైరెక్టర్‌గా విజయభాస్కరరెడ్డి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(జీడీసీఎంఎస్) పాలకవర్గ సభ్యుడిగా మాచర్ల మండలం, కంభంపాడు గ్రామానికి చెందిన ఆరికట్ల విజయభాస్కరరెడ్డి ఇటీవల నియమితులై బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా నియమితులైన విజయభాస్కరరెడ్డి మంగళవారం జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మిని గుంటూరు కన్నావారితోటలోని జీడీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతనంగా పాలకవర్గ సభ్యులుగా నియమితులైన విజయభాస్కరరెడ్డిని మిగిలిన పాలకవర్గ సభ్యులకు పరిచయం చేశారు. ఇదే క్రమంలో గత రెండు సంవత్సరాలుగా పాలకవర్గ సభ్యుడిగా సేవలందించిన మద్దిరాల కృష్ణారెడ్డిని పాలకవర్గ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, జీడీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం, కార్యాలయం మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్కే సాయం

మంగళగిరి: ఇటీవల మృతి చెందిన చేనేత కార్మికుని కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ.25వేల ఆర్థిక సహాయంతోపాటు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు. పెదకూరపాడు మండలం గారపాడు గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు చిన్నం లెనిన్ ఇటీవల మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మృతుడు లెనిన్ కుటుంబానికి మంగళవారం జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు చేతుల మీదుగా రూ.25వేల ఆర్థిక సహాయంతోపాటు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ఎమ్మెల్యే ఆర్కేకు మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛ గుంటూరు ప్రతి ఒక్కరి బాధ్యత

నగర కమిషనర్ కీర్తి చేకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో గుంటూరు నగరానికి మెరుగైన ర్యాంక్ రావడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని, ప్రజలు తమ అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో ప్రత్యేక యాప్ ద్వారా తెలియచేసి నగరానికి మెరుగైన ర్యాంక్ రావడంలో భాగస్వాములు కావాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. మంగళవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అదనపు కమిషనర్, డెప్యూటీ కమిషనర్లు, ఎంహెచ్‌ఓ, ఇతర అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో భాగంగా సిటిజన్ ఫీడ్ బ్యాక్ నమోదు ఆశించిన స్థాయిలో లేదని, వార్డ్ సచివాలయాల వారీగా ప్రతి కార్యదర్శి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. సచివాలయం పరిధిలోని ప్రజలకు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పిస్తూ వారిని కూడా భాగస్వాములను చేస్తూ ఫీడ్ బ్యాక్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యదర్శులు ఫీడ్ బ్యాక్ నమోదులో పూర్తిస్థాయి విధుల్లో ఉండేలా నోడల్ ఆఫీసర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. ఫీడ్ బ్యాక్‌పై రోజువారీ నివేదిక ఇవ్వాలని ఎంహెచ్‌ఓని ఆదేశించారు. నగర ప్రజలనుద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్–2023 పోటీల్లో గుంటూరు నగరానికి మెరుగైన ర్యాంక్ వచ్చేందుకు నగర ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ప్రజలు నేరుగా ఫోన్‌కి వచ్చే ఓటీపీని ఇంటి వద్దకు వచ్చే నగరపాలక సంస్థ వలంటీర్లు, కార్యదర్శులకు తెలిపి అభిప్రాయాలను తెలియచేయాలన్నారు. ఇది ప్రతి ఏడాది కేంద్ర ప్ర భుత్వం నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజల అభిప్రాయం కోసమే ఓటీపీ అని ఎటువంటి అపోహల కు గురికావద్దన్నారు. అదనపు కమిషనర్ పెద్ది రో జా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, రవీంద్ర, ఎంహెచ్‌ఓ డాక్టర్ భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక బద్ధంగా డోర్ టూ డోర్ సర్వే ..

నెహ్రూనగర్: రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024 ఓటర్ల జాబితాకి సంబంధించి డోర్ టూ డోర్ సర్వేను బీఎల్‌ఓలు ప్రణాళికాబద్ధంగా నిర్దేశిత ఎన్నికల సంఘం సూచనల మేరకు చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో నగరంలో జరుగుతున్న డోర్ టూ డోర్ ఓటర్ సర్వేపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు ఓటర్ సర్వే పక్కాగా జరగాలని, ప్రధానంగా ఒకే డోర్ నంబర్‌లో 10 కంటే ఎక్కువ ఓట్లు ఉన్న వాటిని ప్రత్యేకంగా పరిశీలన చేయాలని ఆదేశించారు. సర్వే విధుల్లో ఎక్కడా వలంటీర్లను ఇన్వాల్వ్ చేయవద్దని స్పష్టం చేశారు. బీఎల్‌ఓలు నగరపాలక సంస్థ నుంచి అందించిన గుర్తింపు కార్డులను ధరించి సర్వేలో పాల్గొనాలన్నారు. డోర్ నంబర్లను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే నూతన ఓటర్లను చేర్చాలని, నూతన డోర్‌నంబర్లపై ప్లానింగ్ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలన్నారు. నగర ప్రజలు కూడా తమ ఇంటి వద్దకు ఓటర్ సమాచారం కోసం వచ్చే బీఎల్‌ఓలకు తగిన సమాచారం అందించి సహకరించాలని, ఎన్నికల సంఘం నెల రోజులపాటు ఓటర్ల లిస్టులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ఎటువంటి పొరపాట్లు లేని ఓటర్ల లిస్టు తయారికి స్పెషల్ క్యాంపెయిన్ చేపట్టిందన్నారు.